W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

12-11-2025





## బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నిధులు



మండల పరిధి ఈ బయ్యారం గ్రామపంచాయతీ పోతిరెడ్డిపల్లి గ్రామం కిందిగుంపు లో గల ఫుట్ బ్రిడ్జి ని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ బ్రిడ్జి శిథిలా వస్థకు చేరి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగు తుందని గ్రామస్తుల నుండి ఫిర్యాదు రావడంతో ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించినట్లు తెలిపారు.

08




05

అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా

# మధిర మున్సిపాలిటీ!

## రూ.25వేలు టోకెన్‌తో రూ.2 కోట్ల ఆస్తిపై కన్ను

- డ్యాకుమెంట్లు లేకుండానే ఇంటి నెంబర్ ఇచ్చిన వైనం
- అక్రమార్కులకు అండదండలుగా వ్యవహరిస్తున్న అధికారులు..!
- అసలైన యజమాని ఫిర్యాదుతో అక్రమాలు వెలుగు

మధిర మున్సిపాలిటీ అక్రమాల కేంద్రముగా మారిందని స్థానిక ప్రజలు, భూ యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పత్రాలు, రిజిస్ట్రేషన్లు లేకుండా కేవలం టోకెన్ రశీదుల ఆధారంగా కోట్ల రూపాయల విలువైన స్థలాలకు ఇంటి నంబర్లు ఇచ్చిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. రిటైర్డ్ ఎంఈఓ అనుమోలు భాస్కరరావు స్థలం (సర్వే నంబర్ 221, 254.8 చ.గ.)పై అక్రమంగా ఇంటి నంబర్ ఇచ్చిన ఘటన ప్రజాస్వామ్య పరిపాలన వ్యవస్థపై ప్రశ్నార్థకం ఎత్తింది. ఈ వ్యవహారంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమార్కుల దురాశ ఒకేసారి బహిర్గతమయ్యాయి.



**రూ.25వేలు టోకెన్..**
**రూ.2 కోట్ల ఆస్తిపై కన్ను**

స్థానిక మార్కెట్ విలువ ప్రకారం భాస్కరరావు స్థలం రూ.2 కోట్లకుపైగా ఉంటుంది. అయినా కూడా సంబంధిత అధికారులు కేవలం రూ.25వేల టోకెన్‌ను ఆధారంగా తీసుకుని నాగార్జునకు ఇంటి నంబర్ (6-31/సి/1) ఇచ్చారు. మున్సిపాలిటీ అధికారులు ఈ చర్యకు ఎలా ఒప్పుకున్నారన్నది పెద్ద ప్రశ్న. ఇది మున్సిపల్ వ్యవస్థలో ఉన్న అవినీతికి సాక్ష్యంగా నిలుస్తోంది.

మధిర రూరల్,మహా



07

## ఘనంగా యువజన ఉత్సవాలు

ఖమ్మం,మహా: జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించి నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తుం బూరు సునీల్ రెడ్డి అన్నారు.



04

## అందెశ్రీకి నివాళి

ప్రజాకవి, తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ మరణం యావత్తు తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటును మిగిల్చిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావులు అన్నారు



02

## అభివృద్ధి ఆగింది: మెచ్చా

అశ్వారావుపేట నియోజకవర్గం ఒకప్పుడు అభివృద్ధి ప్రతీక అని, ఇప్పుడు అదే నియోజకవర్గం దుర్భర స్థితిలోకి జారిపో యిందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మహాతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై చెలరేగారు. ప్రజలు నమ్మి ఓట్లు వేశారు.



04

## ఖమ్మం జిల్లా డీఈవోగా జైనీ

ఖమ్మం జిల్లా విద్యాశాఖలో ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారిగా (డీఈవోగా) చైతన్య జైనీ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా డీఈవోగా పనిచేస్తు సెలవులో ఉన్న ఆమెను ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు.

# అభివృద్ధి ఆగింది

## మాటలతోనే మభ్యపెడుతున్నారు

- మేము వేసిన పునాది మీదే అశ్వారావుపేట నిలబడి ఉంది
- రౌడీ రాజ్యంలా కాంగ్రెస్ పాలన
- మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావుతో మహా ఎక్స్ క్లూజివ్




అశ్వారావుపేట నియోజకవర్గం ఒకప్పుడు అభివృద్ధి ప్రతీక అని, ఇప్పుడు అదే నియోజకవర్గం దుర్భర స్థితిలోకి జారిపోయిందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మహాతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై చెలరేగారు. ప్రజలు నమ్మి ఓట్లు వేశారు, కానీ ఇప్పుడు ఆ నమ్మకాన్నే మోసం చేశారు, అని అన్నారు. ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో పలు సంచలన అంశాలు మాట్లాడారు.

### అశ్వారావుపేట-మహా

**మహా: ప్రస్తుత నియోజకవర్గ పరిస్థితిని మీరు ఎలా చూస్తున్నారు?**

**మెచ్చా:** అశ్వారావుపేట పరిస్థితి దయనీయంగా తయారైంది. రోడ్లు గుంతల మయం అయ్యాయి, పక్కన పిచ్చిమొక్కలు పెరిగి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రజలు యాక్సిడెంట్లలో ప్రాణాలు కోల్పోతున్నారు. మేము వేసిన సిమెంట్ రోడ్లు, బిగించిన మోటర్లే ఇప్పటికీ కనిపిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం మాటల్లోనే ఉంది, పనుల్లో కాదు. కొత్తగా ఏదీ చేయకపోగా, ఉన్నదాన్ని సైతం చెడగొడుతున్నారు.

**మహా: ప్రస్తుత ప్రభుత్వ పనితీరు గురించి మీ అభిప్రాయం ఏమిటి?**

**మెచ్చా:** కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు హామీలతో గెలిచింది. కానీ ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. పథకాల పేరుతో ప్రచారం చేస్తున్నారు కానీ ప్రజలకు ప్రయోజనం ఏమీలేదు. అభివృద్ధి కంటే కాంట్రాక్టర్ల వద్ద వాటాలే ముఖ్యమైపోయాయి. మట్టి, ఇసుకల వ్యాపారం వరకూ రాజకీయాల ముసుగులో సాగుతోంది. దీనికి సిగ్గుపడాలి. ప్రజలు నమ్మి ఓట్లు వేసి మోసపోయిన బాధలో ఉన్నారు.

**మహా: ఇటీవల మణుగూరులో జరిగిన దాడిపై మీ స్పందన?**

**మెచ్చా:** అది రౌడీ రాజ్యానికి నిదర్శనం. ప్రజాస్వామ్యానికి మచ్చ. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కక్షపూరిత రాజకీయాలకు తెరలేపింది. అధికారంలో ఉన్నామనే దురహంకారంతో విపక్షాలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రజలు వీటిని చూసి తగిన తీర్పు ఇస్తారు. ఎవరెంత హింసాత్మకంగా వ్యవహరిస్తున్నారో వారికి తగిన బుద్ధి చెబుతారు.

**మహా: మీరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి గురించి చెప్పండి?**

**మెచ్చా:** మా హయాంలో అశ్వారావుపేటలో ఒక్క గ్రామాన్ని కూడా విస్మరించలేదు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, నీటి మోటర్లు, కాలేజీలు, ఆసుపత్రులు, కోర్టులు, వంతెనలు - ఇవన్నీ బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే జరిగాయి. అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశాం, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, ఆర్టీవో సబ్ కార్యాలయం, దమ్మపేట కోర్టు, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు ఏర్పాటు అయ్యాయి. 26 వేల ఎకరాల్లో పోడు పట్టాలు ఇచ్చాం. ప్రతి గ్రామంలో పల్లె దవాఖాన, ప్రకృతి వనం, పంచాయతీ భవనం నిర్మించాం. ఇవన్నీ బిఆర్ఎస్ హయాంలో సాధ్యమయ్యాయి.ఇది రాజకీయాల వల్ల కాదు మా నిబద్ధత వల్ల సాధ్యమైంది. ఆ ప్రాజెక్టులన్నీ నేడు నిలబడి ఉన్నాయి, కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని కొనసాగించడంలో కూడా విఫలమైంది. మేము వేసిన పునాదుల మీదే ఇప్పటికీ అశ్వారావుపేట నిలబడి ఉంది, అని ఆయన స్పష్టం చేశారు.

**మహా: పార్టీ అంతర్గత విభేదాలపై వస్తున్న వ్యాఖ్యలు?**

**మెచ్చా:** అసలు విభేదాలే లేవు. మధ్యలో వచ్చిన కొందరు మధ్యలోనే వెళ్లిపోతారు. పార్టీ కోసం నిజంగా కష్టపడేవారు, కిందిస్థాయి కార్యకర్తలు నాతోనే ఉన్నారు, నాతోనే ఉంటారు. బిఆర్ఎస్ అంటే ప్రజల మనసు. నేను గ్రూపు రాజకీయాలు చేయను, నేరుగా నడిచే వాడిని. మా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ గారిని కలవడానికి నాకు అపాయింట్మెంట్ అవసరం లేదు - నేరుగా వెళ్లి కలవగలిగే స్థాయి గౌరవం నాకు ఉంది. అది నా క్రమశిక్షణకు, పార్టీపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం.



**మహా: మీ రాజకీయ భవిష్యత్తు ఎలా చూస్తున్నారు?**

**మెచ్చా:** రాజకీయాలు అంటే పదవులు కాదు, ప్రజల విశ్వాసం. నేను పనిచేసిన కాలం అశ్వారావుపేట చరిత్రలో మిగిలిపోయింది. ప్రజలు నన్ను నమ్మారు, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే నా బలం. మళ్లీ ప్రజలతో కలిసి అశ్వారావుపేటను వెలిగించే కర్తవ్యాన్ని నేను తప్పక నిర్వర్తిస్తా.





## యంత్ర సామర్థ్యంతోనే అధిక బొగ్గు ఉత్పత్తి

**జే.వి.ఆర్ ఓ.సి లో 4.51 కోట్ల రూపాయలతో 6.5 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన షావల్ కొనుగోలు**

**జనరల్ మేనేజర్ సూర్యనారాయణ రాజు, చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభం**





**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని జలగం వెంగళరావు ఉపరితల గని సింగరేణి బేస్ వర్క్ షాప్ కు 6.5 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన టాటా హిటాచి షావల్ ను 4.51 కోట్ల రూపాయలతో కొనుగోలు చేశారు. ఈ భారీ యంత్రాన్ని ఉపరితల గనుల జనరల్ మేనేజర్ డి.వి.ఎస్ సూర్యనారాయణ రాజు, సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణిలో 72 మిలియన్ టన్నుల లక్ష్యంలో సింహభాగం సత్తుపల్లి గనిలో ఉత్పత్తి అవుతుందని అన్నారు. బొగ్గు ఉత్పత్తి పెంచడానికి యంత్ర సామర్థ్యం అవసరమని ఆ దిశగా సింగరేణి సంస్థ కొత్త యంత్రాలను కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం జే.వి.ఆర్ ఓ.సి ప్రాజెక్టర్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్ మాట్లాడుతూ రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదాలను నివారిస్తూ సంస్థ ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని సంస్థ కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ, ఎస్.ఓ.ఎం ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాసరావు, మేనేజర్ ఆపరేషన్ కళ్యాణ్ రామ్, సంక్షేమ అధికారి దేవదాసు, యూనియన్ ప్రతినిధులు సముద్రాల సుధాకర్, నరసింహారావు, నీలపాల రామారావు అధికార,కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణన నమూనా సర్వేపై ప్రజలు అపోహలకు గురి కావొద్దు

- 7 రెవిన్యూ గ్రామాల్లో జనగణన నమూనా సర్వే
- 6గురు సూపర్వైజర్లు,37 మంది గణకులచే సర్వే
- మైక్ ద్వారా ఒకరోజు ముందే సర్వే చేయనున్న గ్రామస్తులకు సమాచారం
- అంతా డిజిటల్ రూపంలోనే
- మహా పత్రికతో తహసిల్దార్ గొంది గోపాలకృష్ణ



**పినపాక, మహా:** దేశవ్యాప్తంగా జనగణన నమూనా సర్వే ఇప్పటికే ప్రారంభమైంది. ఈ సర్వేను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో యాప్ ద్వారా నిర్వహిస్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని 7 రెవిన్యూ గ్రామాలను మోడల్ సర్వేకు ఎంపిక చేసినట్లు తాసిల్దార్ గొంది గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు సర్వే జరుగుతున్న తీరు తెన్నులను మహా పత్రిక ప్రతినిధి మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కలిసి వివరాలు సేకరించారు. మండలంలోని జానంపేట,ఏడుళ్ళ బయ్యారం ,సింగిరెడ్డిపల్లి ,పినపాక, ఎల్చిరెడ్డిపల్లి, అల్లంపల్లి, గడ్డంపల్లి రెవెన్యూ గ్రామాలలో జనగణన నమూనా సర్వే నిర్వహిస్తున్నట్లు... ఇప్పటికే సిబ్బందికి ట్రైనింగ్ సైతం ఇవ్వడం జరిగిందన్నారు. ఎంతో పారదర్శకంగా నిర్వహించనున్న ఈ సర్వేకు 6గురు సూపర్వైజర్లు,37 మంది గణకులను నియమించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ సర్వే పై ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కాకుండా... ఇళ్లల్లోకి వచ్చిన ఘణకులకు ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని సూచించారు.మైక్ , టమక ద్వారా ఒకరోజు ముందే సర్వే చేయనున్న గ్రామస్తులకు సమాచారం అందించడం జరుగుతుందన్నారు. ఈ ప్రీ టెస్ట్ లో మొత్తం 34 అంశాలపై సమాచారం సేకరిస్తారని.. ఈనెల 30తో ఎంపిక చేయబడిన 7 గ్రామాలలో జనగణన నమూనా సర్వే పూర్తవుతుందని ఆయన తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా నమూనా సర్వేల్లో పాల్గొని విజయవంతం చేయాలని తాసిల్దార్ కోరారు.

## నూతన జిఎంకు సింగరేణి బాధితుల సన్మానం



**సత్తుపల్లి, మహా:** సత్తుపల్లి ఏరియాకి నూతనంగా నియమించిన జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నందు నాయక్ ఆధ్వర్యంలో బాధిత గ్రామాల సభ్యులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా నందు నాయక్ మాట్లాడుతూ సింగరేణి గనుల పరిసర ప్రాంత ప్రజలు ఏళ్ల తరబడి అనేక సమస్యలతో పోరాడుతున్నారని, తమ బాధలు విన్నవించుకోవడానికి సత్తుపల్లి ప్రాంతంలో సంబంధిత అధికారుల లోపం ఉండేదని, సత్తుపల్లి ని సింగరేణి ఏరియాగా ఏర్పాటు చేసి జనరల్ మేనేజర్ నియామకం చేయడం ఆనందంగా ఉందన్నారు. జి.ఎం ఆధ్వర్యంలో ఇబ్బందులకు గురవుతున్న గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోఎం.డి ఇస్రార్ అహ్మద్ (సత్తుపల్లి), విప్పపువ్వు. అప్పారావు(రేజర్ల),లకావత్.ప్రసాద్ (ఆర్.టి.ఐ స్టేట్ అడ్వకేట్), హలవత్.అర్జున (రుద్రాక్ష పల్లి), మారోజు.అశోక్(అంబేద్కర్ నగర్), ఎస్.కె నజీమ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కేసు నమోదు



**ఖమ్మం, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల నియమాలు ఉల్లంఘిం చారన్న ఆరోపణలతో మూడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై మధురానగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు.ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ లపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల సమాచారం ప్రకారం, వీరు ప్రచార సమయంలో అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం, పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించడం, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రసంగాలు చేయడం వంటి చర్యలు చేపట్టారని ఆరోపించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమపై పెట్టిన కేసులు రాజకీయ ప్రతీకార చర్యలేనని ఆరోపించారు. ప్రజల మద్దతు పెరుగుతుండటంతో భయపడిన పాలక పార్టీ పోలీసులను ఉపయోగిస్తున్నదని అన్నారు. ఎన్నికల సంఘం మాత్రం కోడ్ ఉల్లంఘన జరిగిన ప్రతి సందర్భంలో కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

# వనభోజనాలకు తరలిరండి

**మాదిగల ఐక్యతను చాటుదాం.. కూసపాటి శ్రీనివాస్, చదలవాడ సూరి**

**కొత్తగూడెం రూరల్, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం పాలకేంద్రం సమీపంలో ఉన్న శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజ్ ఎదురుగా గల మామిడి తోటలో ఈనెల 24వ తేదీన మాదిగల ఆత్మీయ జ్ఞాన వనభోజనాల కార్యక్రమం జరుగుతుందని కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కార్యక్రమం నిర్వహణ కర్తలు కూసపాటి శ్రీనివాస్, చదలవాడ సూరిలు పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది కూడా మాదిగల ఆత్మీయ జ్ఞాన వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా నిర్వహించేందుకు ముందుకు రావడం జరిగిందని వివరించారు. వనభోజనాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ ఎస్టీ దివ్యాంగుల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి గారి ప్రీతం, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహారావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవిలు పాల్గొంటారని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో తదితరులు పాల్గొన్నారు. అనంతరం వనభోజనాల కార్యక్రమానికి సంబంధించిన వాల్పోస్టర్లు విడుదల చేశారు.



## కేంద్ర ప్రభుత్వం రైతులను ప్రణాళిక ప్రకారం దివాలా తీయిస్తుంది

**ఖమ్మం సిటీ, మహా:** కేంద్ర ప్రభుత్వం రైతులను ప్రణాళిక ప్రకారం దివాలా తీయి స్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు, మంగళవారం ఖమ్మం రామకృష్ణ భవన్ లో చిలకల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం ఖమ్మం డివిజన్ మహాసభ లో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం లో ఆత్మ నిర్భర్ భారత్,వికసిత్ భారత్ నిర్మాణం పేరుతో అనేక సంస్కరణలు తీసుకువస్తుంది అని , ఈ సంస్కరణలు కార్పొరేట్ సంస్థల లాభాల ,ప్రయోజనాలు కోసం తప్ప రైతుల నష్టాలు, కష్టాలు పరిష్కారం కోసం కాదు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 9 న రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించిన విద్యుత్ సంస్కరణల సర్కులర్ ఉచిత విద్యుత్ కు మంగళం పాడే విధంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు జిల్లా, డివిజన్ కేంద్రాల్లో రైతు ప్రదర్శనలు జయప్రదం చేయాలని కోరారు.



# ఖమ్మం జిల్లా డీఈవోగా జైనీ

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్త డీఈవో

### విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించనున్న చైతన్య జైనీ

**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా విద్యాశాఖలో ముఖ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారిగా (డీఈవోగా) చైతన్య జైనీ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా డీఈవోగా పనిచేస్తూ సెలవులో ఉన్న ఆమెను ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు.

#### కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చైతన్య జైనీ

మంగళవారం ఉదయం చైతన్య జైనీ ఖమ్మం డీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందిస్తూ, జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల హాజరు శాతం పెంపు వంటి అంశాలపై సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

#### అనుభవజ్ఞురాలైన విద్యాధికారి చైతన్య జైనీ

చైతన్య జైనీ రాష్ట్రంలో అనుభవజ్ఞురాలైన విద్యా పరిపాలకురాలు. ఆమె గతంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో డీఈవోగా విధులు నిర్వహించారు. అనంతరం కుటుంబ కారణాల రీత్యా ఆంధ్రప్రదేశ్‌లో స్పౌజ్ డిప్యూటేషన్‌పై మూడు సంవత్సరాలపాటు సేవలందించారు. తిరిగి తెలంగాణకు వచ్చి కరీంనగర్ జిల్లా డీఈవోగా బాధ్యతలు స్వీకరించారు.



#### విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి

చైతన్య జైనీ విద్యా రంగంలో క్రమశిక్షణ, పరిపాలనా నైపుణ్యం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చురుకైన వ్యవహారశైలితో గుర్తింపు పొందారు. ఖమ్మం జిల్లాలో పాఠశాలల పనితీరు మెరుగుపరచడం, విద్యార్థుల హాజరు శాతం పెంచడం, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలను విస్తరించడం, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఆమె ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ నివాళులు



**ఖమ్మం సిటీ, మహా:** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్, మాజి ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజి ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, సేవాదళ్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ పాల్గొన్నారు.



## అందెశ్రీకి జర్నలిస్టుల నివాళి

**ఖమ్మం సిటీ , మహా:** ప్రజాకవి, తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ మరణం యావత్తు తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటును మిగిల్చిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావులు అన్నారు. ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్లో గల అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అందెశ్రీకి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అమరహై అందెశ్రీ, జోహార్ అందెశ్రీ అంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చిర్రా రవి, సాంబశివరావులు మాట్లాడుతూ.. చదువు రాకపోయినప్పటికీ అద్భుతమైన తెలంగాణ ఉద్యమ పాటలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గేయాలు రచించి తెలంగాణ స్వరాష్ట్ర మలిదశ ఉద్యమంలో అందెశ్రీ మూలస్తంభంగా నిలిచారని కొనియాడారు. అందెశ్రీ పాటలను గుర్తించిన నేటి తెలంగాణ ప్రభుత్వం జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ జాతీయ గేయంగా గుర్తింపునిచ్చి పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. అలాంటి మహాకవి అందెశ్రీ నేడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. నివాళులు అర్పించిన వారిలో టీజేఎఫ్ జిల్లా నాయకులు రాంశెట్టి విజేత, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, వనం నాగయ్య, మందుల ఉపేందర్, కలకొలను హరీష్ రాజు, మందటి వెంకటరమణ, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, టీఎస్ చక్రవర్తి, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, జిల్లా నాయకులు తిరుపతిరావు, హుస్సేన్, గోవింద్, దూసరి కళ్యాణ్ తదితరులున్నారు.

## పేదలకు ఆరోగ్య భరోసా!

**ఖమ్మం సిటీ, మహా:** పేద ప్రజల కష్టాలను తీర్చడమే నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని నమ్ముతూ... తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వైద్య సహాయం అవసరమైన లబ్ధిదారుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వేగవంతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మంత్రి పొంగులేటి కృషితో పాలేరు నియోజకవర్గానికి ప్రతి నెల దాదాపు రూ. 1 కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు అవుతున్నాయని తెలిపారు.



ఈ నిధులతో నెలకు 400 మందికి పైగా లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. తాజా పంపిణీలో 83 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 29 లక్షల విలువ చేసే చెక్కులను అందజేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అందుకున్న పేద ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం అందించిన ఈ సహకారం ఎంతో గొప్పదని కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఖమ్మం సిటీ , మహా:** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక టీజీవో భవన్ నందు అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వ రరావు, మోదుగు వేల్పాద్రి అధ్యక్షత నిర్వహించ చటం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లా డుతూ ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బకాయి పడ్డ డి ఎ లను వెంటనే విడుదల చేయాలని, పిఆర్సి నీ వెంటనే అమలు చేసి మెరుగైన పిఆర్సి ని ఇవ్వాలని, ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్, టి ఎస్ జి ఎల్ ఐ, సరెండర్ లీవ్, బకాయిలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డులను వెంటనే



మంజూరు చేయా లని, సెప్టెంబర్ నెలలో జరగవలసిన డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేసి వివిధ డిపార్ట్మెంట్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ప్రమోషన్ల ఇవ్వాలని కోరడమైనది. ఈ మధ్యన విడుదల చేసిన కొన్ని బకాయిలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బకాయిలను కూడా వెంటనే విడుదల చేయా లని తీర్మానించడం అయినది . 2026 సంవత్సరపు నూతన డైరీ గురించి కూడా కార్యవర్గంలో చర్చించ డమైనది, ప్రభుత్వ పథకాలను కార్యక్రమాలను టీజీవో డైరీ ద్వారా యాడ్ రూపంలో ఇవ్వడానికి కలెక్టర్ జిల్లా అధికారులు సహకరించాలని కోరడమైనది.



# అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మధిర మున్సిపాలిటీ!

- రూ.25వేలు టోకెన్‌తో రూ.2 కోట్ల ఆస్తిపై బండబూతం..!
- డ్యాకుమెంట్లు లేకుండానే ఇంటి నెంబర్ ఇచ్చిన వైనం
- అక్రమార్కులకు అండదండలుగా వ్యవహరిస్తున్న అధికారులు..!
- అసలైన యజమాని ఫిర్యాదుతో అక్రమాలు వెలుగు

**మధిర రూరల్,మహా:** మధిర మున్సిపాలిటీ అక్రమాల కేంద్రముగా మారిందని స్థానిక ప్రజలు, భూస్వాములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్రాలు, రిజిస్ట్రేషన్లు లేకుండా కేవలం టోకెన్ రశీదుల ఆధారంగా కోట్ల రూపాయల విలువైన స్థలాలకు ఇంటి నంబర్లు ఇచ్చిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. రిటైర్డ్ ఎంఈఓ అనుమోలు భాస్కరరావు స్థలం (సర్వే నంబర్ 221, 254.8 చ.గ.)పై అక్రమంగా ఇంటి నంబర్ ఇచ్చిన ఘటన ప్రజాస్వామ్య పరిపాలన వ్యవస్థపై ప్రశ్నార్థకం ఎత్తింది. ఈ వ్యవహారంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమార్కుల దురాశ ఒకేసారి బహిర్గతమయ్యాయి.

### పత్రాలు లేకుండానే ఇంటి నెంబర్!

మధిర మున్సిపాలిటీ కార్యాలయంలో పత్రాలు లేకుండా, కేవలం ఒక తెల్ల కాగితంపై రాసిన “టోకెన్” ఆధారంగా ఇంటి నంబర్ ఇవ్వబడిన ఘటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. రిటైర్డ్ ఎంఈఓ అనుమోలు భాస్కరరావు తమ స్వంత స్థలం (సర్వే నెం: 221)లో నిర్మాణం ప్రారంభించగా, చెరుకూరి నాగార్జున అనే వ్యక్తి కేవలం రూ.25వేల టోకెన్ చూపించి “ఆ స్థలం తనదే” అని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది.

### రూ.25వేలు టోకెన్.. రూ.2 కోట్ల ఆస్తిపై కన్నేసిన అక్రమార్కులు

స్థానిక మార్కెట్ విలువ ప్రకారం భాస్కరరావు స్థలం రూ.2 కోట్లకు పైగా ఉంటుంది. అయినా కూడా సంబంధిత అధికారులు కేవలం రూ.25వేల టోకెన్‌ను ఆధారంగా తీసుకుని నాగార్జునకు ఇంటి నంబర్ (6–31/సి/1) ఇచ్చారు. మున్సిపాలిటీ అధికారులు ఈ చర్యకు ఎలా ఒప్పుకున్నారన్నది పెద్ద ప్రశ్న. ఇది మున్సిపల్ వ్యవస్థలో ఉన్న అవినీతికి సాక్ష్యంగా నిలుస్తోంది.

### అనుమోలు భాస్కరరావు ఫిర్యాదు.. హైకోర్టు నోటీసులతో కొత్త మలుపు

భాస్కరరావు మాట్లాడుతూ, “నేను పత్రాలతో, రిజిస్ట్రేషన్‌తో చట్టబద్ధంగా స్థలాన్ని కొనుగోలు చేశాను. వి ఎల్ టి ఎం అసెస్మెంట్ నెంబర్ కూడా ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. అయినప్పటికీ మున్సిపాలిటీ అధికారులు టోకెన్ ఆధారంగా ఇతరులకు ఇంటి నెంబర్ ఇవ్వడం అత్యంత అన్యాయం అని తెలిపారు. అదే సమయంలో హైకోర్టు నోటీసులు జారీ చేయడంతో ఆయన నిర్మాణం నిలిపివేయబడింది. మున్సిపాలిటీ అధికారులు హైకోర్టు ఆదేశాలను కూడా తప్పుగా అర్థం చేసుకుని వ్యవహరించారని ఆయన ఆరోపించారు.

### మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల్లో ఆగ్రహం

భాస్కరరావు చేసిన రాతపూర్వక ఫిర్యాదు అనంతరం కూడా అధికారులు విచారణ చేపట్టకుండా మౌనంగా ఉండటంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. మధిర మున్సిపాల్టీ అవినీతి చీకటి గుహలా మారింది, ఎవరు చూసినా లంచాలు లేకుండా పని జరగడం లేదు అని స్థానికులు విమర్శిస్తున్నారు.

### పారదర్శక విచారణ కోరుతూ విజ్ఞప్తి

మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ తక్షణమే దృష్టి సారించాలని, రికార్డులను పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు భాస్కరరావు విజ్ఞప్తి చేశారు.వాస్తవాలు వెలుగులోకి రాకుండా అధికారులు మౌనం వహించడం ప్రజాస్వామ్యానికి అవమానమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# మధిరలో కొత్తగా విద్యుత్ డివిజన్

## డివిజన్ ఇంజనీర్గా బాధ్యతలు స్వీకరించనున్న బండి శ్రీనివాస్

**మధిర రూరల్ , మహా:** మధిర నియోజకవర్గ ప్రజలకు మరో మైలురాయిగా నిలిచే విధంగా విద్యుత్ శాఖలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం, మధిరలో కొత్తగా విద్యుత్ డివిజన్ ఏర్పాటు చేస్తూ, దీన్ని పూర్తిస్థాయి పరిపాలనా కేంద్రంగా గుర్తించింది. ఈ నిర్ణయం వెనుక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిరంతర కృషి, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత ప్రధాన పాత్ర పోషించాయి.



### మధిరకు కొత్త గుర్తింపు.. డివిజన్ స్థాయి హెూదాలి

మధిరను విద్యుత్ శాఖ పరంగా డివిజన్‌గా ప్రకటించడం ద్వారా ఖమ్మం జిల్లాలో అభివృద్ధి వేగం మరింత పెరగనుంది. ఈ డివిజన్ పరిధిలో ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలను చేర్చారు. పలు ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ డిమాండ్ నెరవేరడంతో స్థానికులలో ఆనందం వెల్లివిరుస్తోంది.

### నూతన సబ్‌స్టేషన్లు అండర్‌గ్రౌండ్ కేబుళ్లు

మధిర నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాను నాణ్యంగా, నిరంతరాయంగా అందించేందుకు డిప్యూటీ సీఎం పలు ప్రాజెక్టులను ఇప్పటికే ప్రారంభించారు. సుమారు రూ.50 కోట్ల వ్యయంతో ఐదు సబ్‌స్టేషన్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థలు ఏర్పాటుకు భూమిపూజలు జరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో లోడ్ మేనేజ్‌మెంట్, వోల్టేజ్ స్థిరీకరణ, మరియు భద్రతా చర్యలు మరింత మెరుగుపడనున్నాయి.

### మహిళా సాధికారతకు గ్రీన్ ఎనర్జీ అవకాశాలు

మహిళా సంఘాలకు ఆర్థిక బలాన్నిచ్చే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మధిర నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాలకు గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లు స్థాపించుకునే సౌకర్యాలు కల్పించే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మహిళలు విద్యుత్ ఉత్పత్తి రంగంలో భాగస్వామ్యులు కావడానికి ఇది ఒక ప్రగతిశీల అడుగుగా భావిస్తున్నారు.

### సాంకేతిక పర్యవేక్షణకు కొత్త ఇంజనీరు.. బండి శ్రీనివాస్ బాధ్యతలు

మధిర విద్యుత్ డివిజన్‌లో సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించేందుకు, అనుభవజ్ఞుడైన అధికారి బండి శ్రీనివాస్‌ను డివిజన్ ఇంజనీర్గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమ కాలంలో మధిరలో ఏడీఈగా పనిచేసిన ఆయనకు ఈ ప్రాంత ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఉంది. ప్రస్తుతం వైరా డివిజన్‌లో సేవలు అందిస్తున్న శ్రీనివాస్ రేపటినుంచి మధిరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

### సోలార్ పవర్ పైలెట్ ప్రాజెక్టులు

పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహిం చేందుకు, మధిర నియోజకవర్గాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా ఎంపిక చేసింది. సిరిపురం, బోనకల్లు కేంద్రాలుగా తీసుకుని గృహాలకు ఉచిత విద్యుత్ అందించే సోలార్ పవర్ పైలెట్ ప్రాజెక్టులు ప్రారంభించబడ్డాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ విస్తరణకు ఆదర్శంగా నిలవనుంది.

### భట్టి నాయకత్వానికి కృతజ్ఞతలు

మధిరలో కొత్త డివిజన్ ఏర్పాటు పట్ల స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భట్టి విక్రమార్క పట్టుదల వల్లే ఈ ప్రాంతానికి అభివృద్ధి దిశగా కొత్త వెలుగు వచ్చింది” అని పలువురు స్థానికులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మధిర విద్యుత్ సరఫరా వ్యవస్థ సమర్థవంతంగా మారి, గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా ఎదుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

మహా పత్రిక
ANN తెలుగు

## తెలంగాణ మట్టి వాసనకు ప్రతిబింబం అందెశ్రీ కవిత్వం



**ఖమ్మం సిటీ, మహా:** తెలంగాణ మట్టి వాసనకు ప్రతిబింబం అందెశ్రీ కవిత్వమని టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రచయిత, కాలమిస్ట్ అందెశ్రీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో కె.రాంనారాయణ మాట్లాడుతూ నిరుపేద, నిరక్షరాస్యుడైన అందెశ్రీ గొర్రెల కాపరి నుండి ప్రజాకవిగా ఎదిగాడని అన్నారు. పల్లె జీవితంలోని కన్నీళ్లు, కష్టాలు, ప్రకృతిలో మార్పులు, మనుషుల బాధలను లోతుగా గమనించడం, అనుభవించడం ద్వారా అందెశ్రీ సహజసిద్ధమైన, హృదయాన్ని కదిలించే ఆసు కవిత్వంతో అతితక్కువ సమయంలోనే ప్రజాకవిగా ఎదిగారన్నారు. తన పాటలతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాంక్షను రగిల్చి లక్షలాది మందిని ఉద్యమ చైతన్యం వైపు నడిపించారన్నారు. ఆయన రాసిన జయజయహే తెలంగాణ' గీతం రాష్ట్ర గీతమైందన్నారు. ఆయన జీవితం, సాహిత్యం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కోశాధికారి ఏలూరి వేణు, ప్రెస్‌క్లబ్ కోశాధికారి కళ్యాణ్, ఉపాధ్యక్షులు గండారపు రామారావు, సహాయ కార్యదర్శి శివాజీ, నాయకులు మందా వెంకటేశ్వర్లు, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సామినేని హంతకుల అరెస్టు చేయాలి



**ఖమ్మం , మహా:** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హంతకులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మదుపల్లి గోపాలరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసరకాయల జంగారెడ్డి.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డికి హైదరాబాదులో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పార్టీకి చెందిన సామినేని రామారావును అక్టోబర్ 31వ తేదీన పాతర్లపాడు గ్రామంలో ఉదయం 5:30 గంటల సమయంలో అతి కిరాతకంగా హత్య చేశారని... ఈ ఘటన జరిగి ఇప్పటికీ 12 రోజులు అవుతున్నా నిందితులను అరెస్టు చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. రాజకీయ కక్షతోనే హత్య రామారావు బతికి ఉంటే సీపీఐ (ఎం)ను ఓడించటం సాధ్యం కాదని భావించి రాజకీయ కక్షలతోనే ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని హత్య చేశారని ఆరోపించారు.

## ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి



**ఖమ్మం,మహా:** ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మొగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టు ల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. మొదటి అంతస్తు ఆవరణలో నీరు నిల్వకుండా చేపడుతున్న పనులు పరిశీలించారు. భద్రతాపరంగా ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## విద్య ద్వారా పేదరికం నుంచి శాశ్వతంగా విముక్తి

**ఖమ్మం,మహా:** విద్య ద్వారానే పేదరికం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్ట మొదటి నెహ్రూ నాయకత్వంలోని క్యాబినెట్ లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. హిందీ, అరబిక్, బెంగాలీ, ఇంగ్లీష్ భాషలలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ పండితుడని, 11 సంవత్సరాల పాటు విద్యాశాఖ మంత్రిగా పని చేశారని, దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చదువుకోవాలని ఆశయంతో కులమత బేధాలు లేకుండా పని చేశారని అన్నారు.

# పత్తి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### చలి తీవ్రతతో తేమ శాతం విషయంలో పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి



**ఖమ్మం, మహా:** రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి అమ్ముకునేలా చర్యలు తీసుకున్నామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలుకు అధికార యంత్రాంగం ద్వారా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించి, పలు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. జి.ఆర్.ఆర్. జిన్నింగ్ మిల్స్, పొన్నేకల్లులోని సీసీఐ కేంద్రాన్ని సందర్శించి పత్తి కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్ ఎంట్రీ, గేట్ ఎంట్రీ పాస్, పంట నమోదు లను పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన పత్తి పంటను తేమ యంత్రంతో పరిశీలిస్తున్న తేమశాతం ను గమనించారు. రైతులతో మాట్లాడుతూ, వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. చలిమంచు దృష్టా తేమశాతంలో కొంతమేర వెసులుబాటు ఇవ్వాలని, ఆకాల వర్షాల వలన కొంత పత్తి పంట దెబ్బతిన్నందున గిట్టుబాటు ధర కల్పించాలని, సెంటర్ లో కొనుగోలు సాయంత్రం సమయం పెంచాలని, తెచ్చుకున్న పంటను ఆదేరోజు కొనుగోలు చేయాలని రైతులు కలెక్టర్ కు విన్నవించుకున్నారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ అధికారులను కొనుగోలులో రైతులకు అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించి, ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పత్తి పంట తీసుకు వచ్చిన రైతులకు కనీస మద్దతు ధరను చెల్లించడం జరుగుతుందని, అలాగే రైతులు తేమశాతం 12 ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. జిన్నింగ్ మిల్స్ కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసువచ్చిన పత్తిని అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి తేమ శాతం పేరుతో కొనుగోలు ఆలస్యం చేయకుండా ఆదే రోజు కొనుగోలు అయ్యేలా చూడాలన్నారు. నవంబర్ నెలలో అధికంగా పత్తి పంట కొనుగోలు జరుగుతుందని, దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో అందించాలని తెలిపారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు సౌకర్యార్థం కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా హెల్ఫ్ సెల్స్ డెస్క్ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## విద్యార్థుల అభ్యసన ఫలితాల సాధనే లక్ష్యం



**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింతగా పెంచి, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే దిశగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్య జైని ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 2025 సంవత్సరంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు మరియు వేసవికాలంలో శిక్షణకు హాజరుకాని ఉపాధ్యాయుల కోసం ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లాలోని రెండు కేంద్రాల్లో ప్రారంభమై, విద్యా రంగానికి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్య జైని సోమవారం ఆకస్మికంగా జిల్లా శిక్షణా సంస్థ (డైట్) కేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణను సద్వినియోగం చేసుకొని, విద్యార్థుల అభ్యసన ఫలితాలను సాధించడంలో తన వంతు పాత్ర పోషించాలని ఆమె సూచించారు. ఆమె మాట్లాడుతూ, "నాణ్యమైన విద్యను అందించడం మనందరి బాధ్యత. ప్రతి తరగతిలో విద్యార్థుల అభ్యసన ఫలితాలను విశ్లేషించి, వారికి అవసరమైన సహకారం అందించడం ద్వారా మన జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపుదాం" అని ఉపాధ్యాయులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు.డైట్ కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, గణితశాస్త్ర విభాగాల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభమైంది.

## అదనపు కలెక్టర్‌ను కలిసిన డీఈవో

**ఖమ్మం,మహా:** జిల్లా విద్యాశాఖ అధికారి గా ఇటీవల నియమితులైన చైతన్య జైని, మంగళవారం తన బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరూ జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధి, పాఠశాలల ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల సంక్షేమం వంటి అంశాలపై చర్చించారు. అదనపు కలెక్టర్ డా. శ్రీజ, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైతన్య జైనికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# కరిసెలబోడు తండాలో విషాదం

## స్కూల్ బస్సు కిందపడి మూడేళ్ల బాలుడు మృతి

**జూలూరుపాడు, మహా:** కరిసెలబోడు తండాలో మంగళవారం తీవ్ర విషాదం చోటు చేసుకున్న సంఘటన జరిగింది. జూలూరు పాడు మండల కేంద్రంలోని సాయి ఎక్సలెంట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు చండ్రుగొండ మండలంలోని కరిసెల బోడు గ్రామంలో స్కూల్ పిల్లలను ఎక్కించుకొని వస్తుండగా, అదే గ్రామానికి చెందిన భూక్య గోపి, అఖిల దంపతుల ముక్కు పచ్చలారని మూడేళ్ల వయస్సు గల ముద్దుల కుమారుడు భూక్య దర్శిత్ నాయక్ స్కూల్ బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దర్శిత్ మృతి తల్లిదండ్రుల ఆర్తనాధాలతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. విషయం తెలుసుకున్న చండ్రుగొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి

**తల్లాడ,మహా:** రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పత్తి, ధాన్య కొనుగోళ్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం తల్లాడ, కల్లూరు మండలాల్లో అదనపు కలెక్టర్ పర్యటించి సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు, ధాన్య కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, తల్లాడ మండల కేంద్రంలో సిసిఐ చే ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పత్తి కొనుగోళ్లను పరిశీలించి, ట్యాబ్ ఎంట్రీ, పంట నమోదులను తనిఖీ చేశారు. కొనుగోలుకు వచ్చిన పత్తిని తేమ యంత్రంతో తేమ శాతం పరిశీలన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు రైతులకు సహకరించి, కొనుగోలు ప్రక్రియ సజావుగా చేపట్టాలన్నారు. తల్లాడ లోని వెంకట పద్మావతి రైస్ మిల్ ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతి, ట్రక్ షీట్ల నమోదుకు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే అన్లోడ్ చేసుకోవాలని మిల్లర్ కు సూచించారు. జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రాంగణ నియామకాలలో ఎంపికైన 70 మంది యస్‌బిఐటి విద్యార్థులు



**ఖమ్మం సిటీ, మహా:** తెలంగాణా అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి సహకారంతో నిర్వహించిన టెలీపర్ఫార్మెన్స్ ప్రాంగణ నియామకాలలో తమ కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలియజేశారు. డిజిటల్ బిజినెస్ సర్వీసెస్, ఓమ్ని ఛానల్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సొల్యూషన్స్ అందిస్తు భారతదేశంలో 90,000 ఉద్యోగులు కలిగిన అతిపెద్ద సంస్థలో తమ విద్యార్థులు స్థానం సాధించడం హర్షణీయం అని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఘనంగా యువజన ఉత్సవాలు..





**ఖమ్మం,మహా:** జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రం లో మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి అన్నారు. 29 వ జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలను 850 మంది యువ కళాకారులతో జిల్లా స్థాయి కళాకారుల ఎంపికలను విజయవంతంగా నిర్వహించినట్లు యువజన, క్రీడల అధికారి అన్నారు. స్వామీ వివేకానంద చిత్రపటానికి పూల మాలలతో అలంకరించి, జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. జానపద నృత్యం గ్రూప్ ఫోక్ డ్యాన్స్, జానపద గేయాలు గ్రూప్ ఫోక్ సాంగ్, వ్యాస రచన, పోస్టర్ తయారీ, వ్రకృత్వ పోటీలు, కవిత్వం, ఇన్నోవేషన్ మొదలగు అంశాలలో ప్రదర్శనలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆర్. ఉదయ్ కుమార్, న్యాయ నిర్ణేతలు విచ్చేసిన జాన్, మాలతీ నాయుడు , ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ లెక్చరర్లు కే. రవికుమార్, ఐ. కిరణ్ కుమార్, కే. మధు, బి. శ్రీనివాస్, జి. వీరన్న పాల్గొన్నారు.

# సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి



**మణుగూరు, మహా:** పోరాటాల చరిత్ర కలిగిన ఎర్రజెండా సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు విట్టల్ రావు నగర్ గ్రామంలో సిపిఐ నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం లేకపోయినా సిపిఐ పార్టీ 100 సంవత్సరాల చరిత్రలో ప్రజల మనసుల్లో బ్రతికే ఉందని, స్వాతంత్ర్య పోరాటం నుంచి ప్రజా ఉద్యమాల దాకా ఎర్రజెండా పోరాటాలకు చిహ్నంగా నిలిచిందని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో జరగనున్న సిపిఐ శతజయంతి ముగింపు వేడుకలు ఘనంగా జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా, అలాగే 40 దేశాల నుంచి ప్రతినిధులు, సుమారు 5 లక్షల మంది ప్రజలు హాజరుకానున్నారని తెలిపారు. జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొనబోతున్న ఈ చారిత్రాత్మక బహిరంగ సభకు మణుగూరు నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. దీనికోసం గ్రామ గ్రామాన కరపత్రాలు పంచుతూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు రాయల బిక్షం, మంద కోటి, బొజ్జ సదానందం, ఐతనమైన వెంకన్న, బోశెట్టి సంపత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ పనులు పరిశీలన



**చింతకాని,మహా:** పదవులు శాశ్వతం కావు మనం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలే శాశ్వతం” అని నిరూపిస్తూ, ప్రతి పల్లె అభివృద్ధి చెందాలి అన్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆలోచనలకు కార్యరూ పంగా, మండల పరిధిలోని వందనం, కోదుమూరు రాఘవపురం, లచ్చగూడెం గ్రామాలకు నీరు అందించేందుకు రెండో దశ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను, శిలాఫలకాన్ని మరియు సభా స్థలాన్ని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ సురేష్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బందెల నాగార్జున, ఎస్.కే. కాసిం, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మదుపల్లి భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి..

**మణుగూరు, మహా:** మణుగూరు ఏరియా టీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో ఈ నెల 19వ తేదీన జరగనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమం పై మండల శ్రేణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ మాట్లాడారు. నియోజకవర్గ యువతకు నాలుగు వేల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాబ్ మేళా నిర్వహణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సింగరేణి సి, ఎండి బలరాంలు సహకారం అందించారని తెలిపారు.

FOLLOW: @ANNTELUGU
12-11-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# శ్రీ వేద గాయత్రీ ఆలయంలో అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదాలు



**మణుగూరు, మహా :** మణుగూరు మండల పరిధిలోని గుట్ట మల్లారం ప్రాంతంలోగల శ్రీ పంచముఖ వేద గాయత్రీ, శ్రీ వేంకటేశ్వరస్వామి సహిత శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నాడు అయ్యప్ప స్వాములకు భక్తిపూర్వకంగా అన్న ప్రసాదం నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప, శరణం అయ్యప్ప స్వామీ అనే శరణం ఘోషలతో ఆలయ వాతావరణం మంత్రముగ్ధంగా మారింది. అన్నప్రసాద సేవ కార్యక్రమానికి అన్న ప్రసాద దాతలుగా శ్రీ రామ్ రాము–స్వర్ణలత దంపతులు వ్యవహరించారు. వారు అయ్యప్ప భక్తులందరికీ భక్తిపూర్వకంగా అన్నప్రసాదం అందజేసి స్వామి ఆశీర్వాదంతో అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు వేదపారాయణం, హారతులతో ఆలయం లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం అన్నదాతలుగా వ్యవహరించిన శ్రీరాం రాము దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.


# సర్టిఫికెట్లు ఇప్పిస్తానని డబ్బులు దండుకుంటున్న బడావత్ నవీన్



**బోనకల్ మహా:** ఖమ్మం జిల్లా లోని మండల కేంద్రంలో విద్యార్థుల కు,ప్రజలకు ఐటిఐ, ఎమ్మెటీ, డిప్లమా,డిగ్రీ సర్టిఫికెట్లు ఇప్పిస్తానని ఖమ్మం జిల్లాకు చెందిన బడవత్ నవీన్ అక్రమ మోసాలకు పాల్పడుతున్నాడు. బడవత్ నవీన్ సర్టిఫికెట్లు ఇప్పిస్తానని చెప్పి 12 మంది దగ్గర 2 లక్షల రూపాయలను దండుకొని పరారయ్యాడనీ తెలిపారు. తన అడ్రస్ లు వివరాలు గార్ల,డోర్నకల్, మహబూబాబాద్, ఖమ్మం మధిర గ్రామం అంటూ ఎప్పటికప్పుడు అడ్రస్లు మారుస్తూ తప్పుడు అడ్రస్లు చూపించి మధ్యతరగతి కుటుంబ పరిస్థితుల కోసం శ్రమించే సామాన్య ప్రజలను విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని వారి ఉద్యోగ అవకాశాల కోసం సంబంధించి సర్టిఫికెట్లు ఇప్పిస్తానని డబ్బులు దండుకొని బడవత్ నవీన్ సామాన్య ప్రజలను మోసం చేస్తున్నాడనీ అన్నారు.ఈ ఫోటో లో ఉన్న బడావత్ నవీన్ మీకు కనిపిస్తే, మీ కుటుంబ సభ్యులను, మీ బంధుమిత్రులను, స్నేహితులను, సర్టిఫికెట్ల పేర్లతో మోసం చేస్తున్న బడావత్ నవీన్ బారి నుండి కాపాడండి అన్నారు.మీ స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించి అక్రమాలకు పాల్పడుతున్న బడావత్ నవీన్ పోలీసుల కు పట్టించండని, బడావత్ నవీన్ వల్ల మోసానికి బాధింపబడిన వారు ఖమ్మం జిల్లా ప్రజలును, విద్యార్థులను ప్రజా ప్రతినిధులను కోరారు.

# ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

## రూ.30 వేల నగదు...నిత్యవసర వస్తువులు దగ్ధం



**నేలకొండపల్లి, మహా:** మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ఓ ఇల్లు విద్యుత్ షార్ట్ షర్క్యూట్తో ఇల్లు దగ్ధమైంది. బాధితురాలి కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన సుభద్ర అనే నివాసంలో అకస్మికంగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న వస్త్రాలు, నిత్యవసర సరుకులు. రూ.30 వేల నగదు మంటలలో అహుతైయ్యాయి. స్థానికులు గమనించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లేని పక్షంలో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొన్నారు. నగదు తో పాటు వివిధ నిత్యవసర సరుకులు, వస్త్రాలు వస్తువులు అన్ని కలిపి దాదాపు రూ.70 వేల కు పైగా నష్టపోయినట్లు బాధితురాలు పేర్కోన్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకుంది.

# మునగ సాగుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు: ఎంపీడీవో సంకీర్త్



**పినపాక ,మహా:** మునగ సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు. మంగళవారం పినపాక మండల కేంద్రంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.మునగ సాగుకు ఉపాధి హామీ పథకంలో 100% సబ్సిడీతో ఎకరానికి రూ. 1.20 లక్షలు లభిస్తాయని, మార్కెట్లో మునగ పంట కు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ప్రభుత్వం రాయితీలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, సంప్రదాయ పంటలకు బదులు లాభదాయకమైన మునగ సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. జిల్లా కలెక్టర్ సైతం మనకు సాగుపై ప్రత్యేక దృష్టి సారించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పూర్తి వివరాలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో రైతులు సంప్రదించాలని కోరారు.

# బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నిధులు

**పినపాక, మహా:** మండల పరిధి ఈ బయ్యారం గ్రామపంచాయతీ పోతిరెడ్డిపల్లి గ్రామం కిందిగుంపు లో గల ఫుట్ బ్రిడ్జి ని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ బ్రిడ్జి శిధిలావస్థకు చేరి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తుల నుండి ఫిర్యాదు రావడంతో ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించినట్లు తెలిపారు. ఆ బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నిధులు కేటాయించారని త్వరలోనే త్వరలో పనులు ప్రారంభమైతాయని తెలిపారు. అనంతరం గ్రామస్తులను అడిగి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మద్దులపల్లి ఊటవాగు అటవీ ప్రాంతంలో నెమళ్లను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ ఆఫీసర్లు





**కామేపల్లి, మహా:** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మద్దులపల్లి దట్టమైన ఊట వాగు అటవీ ప్రాంతంలో కోయలు సాగు చేస్తున్న పోడు భూముల వద్ద మంగళవారం మూడు నెమలి పిల్లలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి మద్దులపల్లి ఊట వాగు వాగు సమీపంలో పోడు భూముల్లో కోయలకు మూడు నెమలి పిల్లలు కనిపించడంతో వెంటనే వారు తాళ్లగూడెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి శిల్ప కు సమాచారం అందించారు. స్పందించిన ఆమె మద్దులపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాగరాజు, ప్లాంటేషన్ ఆఫీసర్ సతీష్ తో పాటు సిబ్బందితో కలిసి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వాటిని కామేపల్లి పశు వైద్యశాలకు తరలించారు. అక్కడ వాటికి పశు వైద్యాధికారి నాగులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉన్నతాధికారుల సూచనల మేరకు నెమలి పిల్లలను ఖమ్మం అర్బన్ పార్క్ కు తరలించారు.



# సిఏ విద్యార్థి కీ ఘన సన్మానం

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పాపకొల్లు గ్రామానికి చెందిన బొడ్డు నాగేశ్వరరావు తనయుడు బొడ్డు సతీష్ సీఏ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రామిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం సతీష్ ను సాలువతో ఘనంగా సన్మానించి అభినందించారు. సన్మానించిన వారిలో మున్నూరు కాపు స్టేట్ జాయింట్ సెక్రెటరీ బాపట్ల మురళి, మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉసికల రమేష్, మండల మున్నూరు కాపు సంఘం కోశాధికారి రామిశెట్టి నాగేశ్వరరావు, రోకటి రమేష్, పాలెపు భద్రయ్య, అరిగెల నరసింహారావు, మునుపాటి అప్పారావు, మద్దిశెట్టి ప్రకాష్, పాపిన్ని వెంకయ్య, నాగయ్య పాల్గొన్నారు.

# రైతులకు కాపస్ కిసాన్‌తో మేలు

కారేపల్లి, మహా : కాపస్ కిసాన్ మొబ్కెల్ యాఫ్‌తో రైతుకు ఎంతో లాభదాయకమని ఇల్లందు మార్కెట్ కమిటి కార్యదర్శి నరేష్‌కుమార్ అన్నారు. కారేపల్లి శ్రీ లక్ష్మీ కొటేక్స్ జిన్నింగ్ మిల్ ప్రాంగణంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా కారేపల్లిలో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ ప్రాంత రైతుల పత్తిని కొనుగోలు చేస్తూ వారికి ప్రభుత్వం ధరను అందిస్తున్నట్లు తెలిపారు.

# సమానత్వంతోనే సమాజ అభివృద్ధి

కారేపల్లి, మహా : మహిళల పట్ల వివక్షత లేకుండా సమానత్వం తోనే సమాజ పురోగతి సాధిస్తుందని సింగరేణి తహసీల్దార్ అనంతుల రమేష్, ఎస్సై సాయిన్ని నవిత లు అన్నారు. మంగళవారం కారేపల్లి ఎస్ఆర్ఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకు లంలో అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్ధార్, ఎస్సైలు మాట్లాడుతూ మగ పిల్లల తో సమానంగా చదివించాలని, అప్పుడే ఆడపిల్లలు మగ పిల్లలతో సమానంగా అన్ని రంగాలలో దూసుకెళ్తరన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి



**నేలకొండపల్లి, మహా:** అండర్–19 రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి... జాతీయ స్థాయి పోటీలకు బోదులబండ కు చెందిన గండారపు వెంకటసాయి ఎంపికైయ్యారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బోదులబండ గ్రామానికి చెందిన గండారపు వెంకటసాయి అథ్లెటిక్స్ లో రాష్ట్ర స్థాయి లో జరిగిన పోటీలలో ప్రతిభ చూపారు. ఆరు కిలోమీటర్లు. 400 మీటర్లు పరుగు పందెంలో రెండు రజిత పధకాలను గెలుచుకున్నాడు. హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు స్థానికులు గుండు మహేష్, అనంతు రవి. కాసాని విగ్నేష్, చింతలపాటి లెనిన్ .తదితరులు అభినందించారు.

# అయ్యప్ప భక్తుల ప్రత్యేక పూజలు



**నేలకొండపల్లి, మహా:** అయ్యప్ప భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవి భవన్‌కు చెందిన భక్తులు శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయం, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆకుపూజ నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని...పాడి పంటలు బాగుండాలని కోరుతూ... పూజలు చేపట్టారు. ఆయప్ప భక్తిగీతాలతో ఆటా, పాటలతో సందడి చేశారు.